జాతీయ వార్తను ఈ-పేపర్‌లోనూ,
డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.జాతీయవార్త.కామ్‌లో
కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

జాతీయ **వార్త**
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..
జాతీయ వార్త తెలుగు దినపత్రిక
మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రికలో ప్రచురిస్తాం. మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761
epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com

సోమవారం | 15-6-2026 | శ్రీకాకుళం | సంపుటి: 3 సంచిక: 701 పేజీలు: 4 వెల : రూ.7

# రాజకీయాలకతీతంగా.



# ఏకమవుదాం


* ఐక్యతతోనే అభివృద్ధి సాధ్యం
* కాపు కులంలో పుట్టడం వల్లే నాకు ఇంతటి గౌరవం
* ఒకే సంఘంతోనే అభివృద్ధికి ఆస్కారం
* మాజీ మంత్రి బొత్స సత్యన్నారాయణ
* 35 రోజుల్లో తనను శాసనమండలికి పంపిన ఘనత కాపులదే
* చదువుతోనే ఆర్థిక పరిపుష్టి
* ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు
* కాపులను విభజించి పాలకులు అణగదొక్కుతున్నారు
* మనం గళం విప్పితేనే రాజకీయంగా ప్రాధాన్యత
* మార్కెఫెడ్ రాష్ట్ర డైరక్టర్ ఆనెపు రామకృష్ణంనాయుడు
* పలు తీర్మాణాలను ఏకగ్రీవంగా ఆమోదించిన కార్యవర్గం
* కాపుల ఐక్యత సమ్మేళనానికి తరలివచ్చిన నేతలు

**శ్రీకాకుళం, జూన్ 14 (వార్త):** ఉత్తరాంధ్రలోనే అత్యధిక జనాభా కలిగిన తూర్పు కాపు సామాజిక వర్గం ఐక్యతగా ముందుకు సాగితేనే అభివృద్ధి సాధ్యమవుతుందని మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ పిలుపునిచ్చారు. శ్రీకాకుళం నగరంలోని సప్తగిరి కళ్యాణ మండపంలో ఆదివారం తూర్పు కాపు ఆత్మగౌరవ సమ్మేళన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా తూర్పుకాపు సామాజిక వర్గాన్ని అభివృద్ధి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. తాను తూర్పు కాపు కులంలో పుట్టడం వల్లే ఈ గౌరవం తనకు దక్కిందని ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు ఇతర కులాలకు వ్యతిరేకం కాకుండా తూర్పు కాపు జాతికి ప్రతి ఒక్కరూ జీవితం ఇవ్వాల్సిన అవసరం ఆసన్నమైందన్నారు. ఒకే సంఘం ఉండడం వలన అభివృద్ధికి అవకాశం లభిస్తుందని ఎవరికి ఎటువంటి నష్టం జరగకుండా చూసుకోవాల్సిన బాధ్యత సామాజిక వర్గ పెద్దలు, ప్రతినిధులపై ఉందన్నారు. ఇప్పుడు ఈ అవకాశం వచ్చినా జాతి కోసం ఎలాంటి సహాయం కావాలన్నా చేసేందుకు తాను సిద్ధంగా ఉన్నానని ఈ సందర్భంగా వెల్లడించారు. ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవి మాట్లాడుతూ విద్యతోనే ఆర్థిక పరిపుష్టి సాధ్యమవుతుందని చెప్పారు. వేరే సామాజిక వర్గానికి ఎమ్మెల్సీ కేటాయించినప్పటికీ తూర్పు కాపులకు అన్యాయం జరిగిందంటూ పెద్ద ఎత్తున గళం ఎత్తి తనకు ఎమ్మెల్సీ సీటును కేటాయించేలా ఒత్తిడి తెచ్చిన తూర్పు కాపు జాతికి ఎప్పటికీ రుణపడి ఉంటానని తెలిపారు. 35 రోజుల్లో తన కోసం నిరంతరం పనిచేసే గెలుపుకు బాటలు వేసి శాసనమండలికి పంపించిన తూర్పు కాపు జాతి గొప్పతనాన్ని చాటి చెప్పారని వివరించారు. సామాజిక వర్గంలో ఉన్న అంతర్గత విభేదాలు వల్ల జాతి ఐక్యతకు విఘాతం ఏర్పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. శ్రీకాకుళం జిల్లా కేంద్రంలో ఇతర సామాజిక వర్గాలకు భవనాలను కేటాయించి తూర్పుకాపులకు మాత్రం బీసీ వెల్ఫేర్ ఆధ్వర్యంలో భవనం కేటాయించడం దుర్మార్గమైన చర్య అని చెప్పారు. మార్క్ఫెడ్ రాష్ట్ర డైరెక్టర్ ఆనెపు రామకృష్ణ నాయుడు మాట్లాడుతూ తూర్పు కాపు జాతిని విభజించి పాలకులు వెనకబడేలా చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యతోనే ఆర్థికంగా ఎదిగేందుకు అవకాశం లభిస్తుందని చెప్పారు. బొత్స సత్యనారాయణకు మూడుసార్లు ముఖ్యమంత్రి అయ్యే అవకాశం వచ్చినప్పటికీ కాపు జాతిలో పుట్టడం వల్ల ఆయన శాశ్వతంగా సీఎం అయిపోతారేమోనని భయంతో ఆయనను పూర్తిగా అణగదొక్కారని ఈ సందర్భంగా వివరించారు. గొర్లె శ్రీరాములనాయుడు, బొత్స సత్యనారాయణ వంటి నాయకులు దేశంలోనే గొప్ప గౌరవాన్ని పొందారని ఈ సందర్భంగా గుర్తు చేశారు. మనం గళం విప్పితేనే రాజకీయంగా ప్రాధాన్యత లభిస్తుందని చెప్పారు. సామాజికంగా రాజకీయంగా ఆర్థికంగా ముందుకు సాగాల్సిన అవసరం ఏర్పడిందన్నారు. పాలకొండ, ఎచ్చెర్ల, రాజాం వంటి నియోజకవర్గం కాపులు అత్యధికంగా ఉన్నప్పటికీ అక్కడ ఎస్సీ, ఎస్టీ, ఓసి సామాజిక వర్గాలకు శాసనసభ స్థానాల్లో అవకాశం కల్పిస్తున్నారని, ఇది కాపు జాతికి తీవ్రంగా జరుగుతున్న అన్యాయమని పేర్కొన్నారు. పలువురు కాపు నేతలు మాట్లాడుతూ శ్రీకాకుళం జిల్లా కేంద్రంలో తూర్పు కాపులకు సామాజిక భవనం చాలా అవసరం, ఆవశ్యకత అని ఇతర ప్రాంతాల నుంచి ఇక్కడికి వచ్చేవారు తమ పుట్టినిల్లుగా భావించి ఆ భవనంలో ఉండేందుకు అవకాశం కల్పించాలని కోరారు. ఈ ఆత్మ గౌరవ సమ్మేళన కార్యక్రమంలో బిజెపి జిల్లా అధ్యక్షుడు సిరిపురం తేజేశ్వర రావు, డీసీసీబీ ఛైర్మన్ సివ్వాల సూర్యనారాయణ. జిల్లా గ్రంధాలయ సంస్థ ఛైర్మన్ పీరుకట్ల విఠల్, డీసీసీబీ మాజీ ఛైర్మన్ కరిమి రాజేశ్వరరావు, శ్రీకాకుళం జిల్లా తూర్పుకాపు సామాజిక వర్గం ప్రతినిధులు సురంగి మోహన్‌రావు, శాసపు జోగినాయుడు, డాక్టర్ ఎం.రామజోగినాయుడు, వాళ్ళ శ్రీరాములు నాయుడు, పొండ్రంకి శంకర్, ఎం.వి స్వరూప్, కిలారి నారాయణరావు, పడాల తమ్మి నాయుడు, మక్కా శ్రీనివాస్, డోల భాల వంశీ కృష్ణ, కెళ్ళ చిన్ని, అల్లు యుగంధర్ వాళ్ళ సన్యాసినాయుడు, వాన కృష్ణచంద్, కొమ్ము రమణమూర్తి, జె ఎస్ రాజు, ఉత్తరాంధ్ర జిల్లాల నుండి పెద్ద ఎత్తున తూర్పు కాపు సామాజిక వర్గం ప్రతినిధులు హాజరయ్యారు.



# ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కుల పంపిణీ

**పలాస, జూన్ 14 (వార్త):** అనారోగ్యంతో బాధపడుతున్న పలాస మండలం రాజగోపాల్ పురం గ్రామానికి చెందిన కవిటి మోహన్ రావు కుమారుడు శాంతారావు అనారోగ్యంతో పాటు ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్నాడని తెలిసి పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష ఆదివారం బాధితుని కుటుంబ సభ్యులకు రు. 38,000చెక్కును అందజేశారు. పలాస క్లస్టర్ ఇంచార్జ్ తమ్మినేని గంగారం ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లగా ఆమె సీఎం రిలీఫ్ ఫండ్ నుండి ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమం లో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ పీరికట్ల విటల్ రావు, గంగువాడ నీటి సంఘం ఉపాధ్యక్షులు శ్రీకాంతరాం జగన్నాథం తదితరులు ఉన్నారు.



## నిరుపేద కుటుంబానికి ఆర్థిక సాయం





**మెళియాపుట్టి, జూన్ 14 (వార్త):** కష్టసుఖాలలో ఒకరికొకరు తోడునీడగా ఉంటూ కుటుంబాన్ని నెట్టుకొస్తున్న తరుణంలో ఆ కుటుంబంలో భార్య చంద్రకళకు పెరాల్సిస్ స్ట్రోక్ వచ్చింది. గడిచిన రెండు సంవత్సరాలుగా ఆమె తీవ్ర ఇబ్బందులు పడుతోంది. భర్త కుమార్ ఆమెకు సేవలు అందిస్తున్నారు. వారు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలుసుకున్న గ్రామ యువకులు స్పందించి ఆర్థికసాయం చేశారు. వివరాల్లోకి వెళితే మెళియాపుట్టి మండలం, పరశురాంపురం పంచాయతీలో హీరాపురం గ్రామంలో నిరుపేద కుటుంబానికి చెందిన సింహాద్రి కుమార్ తన భార్య సింహాద్రి చంద్రకళకు గడిచిన రెండేళ్లగా ఆమె పెరలాసిస్ తో బాధపడుతున్న నేపథ్యంలో ఇంట్లో మంచం బారిన పడిన భార్య చంద్రకళకు అన్ని తానై సపర్యాలు చేస్తూనే భర్త కుమార్ కూలి నాలి పనికి వెళ్తూనే వచ్చే చాలీచాలని ఆదాయంతో కుటుంబాన్ని నెట్టుకొస్తూ కాలం వెళ్లదీస్తున్నాడు. వీరి పరిస్థితులు తెలుసుకున్న గ్రామ యువకులు గ్రామస్తులు చందాలు వేసుకుని రూ.28,400 సేకరించారు. ఆ మొత్తాన్ని చంద్రకళ భర్త కుమార్‌కు ఆదివారం అందజేశారు. గ్రామంలో ఎవరైనా కష్టకాలంలో ఉంటే మేము చూస్తూ ఉండలేమని అందుకు తమంత సంఘటితంగా వ్యవహరించి, మానవతా దృక్పథంతో ఆ కుటుంబానికి కొంత సహకారం అందించడం చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో పొట్నూరు రాజు, లక్ష్మీపురం బాబురావు మాస్టర్, ఉమాశంకర్, బేరి ధర్మారావు, జి. చిరంజీవి, కిల్లి రుషి, జె. పాపారావు, చుక్కా జోగారావు, డి. శ్రీను, యువత, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## జంగిల్ క్లియరెన్స్ మట్టి పనులకు 4 లక్షలు మంజూరు

### పార్లమెంటరీ కార్యనిర్వహక కార్యదర్శి రాజశేఖర్ రెడ్డి





**మెళియాపుట్టి, జూన్ 14 (వార్త):** మెళియాపుట్టి మండల కేంద్రంలోని ఉన్న చింతల గాదింగా చెరువు ఆయకట్టు పరిధిలో జంగిల్ క్లియరెన్స్, మట్టి పనుల అభివృద్ధి చేసే నిమిత్తం స్థానిక ఎమ్మెల్యే మామిడి గోవిందరావు ప్రతిపాదనలతో నాలుగు లక్షల రూపాయలు నిధులు మంజూరైనట్లు శ్రీకాకుళం పార్లమెంటరీ ఆర్గనైజింగ్ సెక్రెటరీ (కార్యనిర్వహక కార్యదర్శి) అనపాన రాజశేఖర్ రెడ్డి తెలియపరిచారు. మెళియాపుట్టి గ్రామ నీటి సంఘ అధ్యక్షురాలు అనపాన రాజరత్నం నేతృత్వంలో చింతల గాదింగ చెరువు ఆయకట్టు పరిధిలో చెరువుతోపాటు దేశభట్టి కాలువలో జంగిల్ క్లియరెన్స్, మట్టి అభివృద్ధి పనులను ఆదివారం ప్రారంభించినట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం రానున్న ఖరీఫ్ సీజన్లో రైతులకు వ్యవసాయ పనుల నిమిత్తం నీటిని సంరక్షించి, పంటలు పండించుకోనే వీలుగా స్థానిక శాసనసభ్యుల ప్రతిపాదనలతో మండలంలో మెలియాపుట్టి, చాపర, కరజాడ, కోసమాల, మారేడుకోట, పెద్ద పద్మాపురం గ్రామాలలో ఉన్న చెరువుల ఆయికట్టుల అభివృద్ధి పరిచే దశగా స్థానిక శాసనసభ్యులు మామిడి గోవిందరావు ఒక్కొక్క దానికి నాలుగు లక్షల రూపాయలు చొప్పున మంజూరు చేసినట్లు రాజశేఖర్ రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో బోను మన్మధ, నక్కల సీతయ్య రెడ్డి, డి.శంకర్ రెడ్డి, జి.రామకృష్ణ, కె.కృష్ణారావు రైతులు పాల్గొన్నారు.

## ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా



**మెళియాపుట్టి, జూన్ 14 (వార్త):** మెళియాపుట్టి కేంద్రంలో నీటి కొరత ఉన్న ప్రాంతాలలో ట్యాంకర్ల ద్వారా పంచాయితీ ద్వారా నీటిని సరఫరా చేసి ప్రజలకు అందించడం జరుగుతుందని మండల దేశం పార్టీ యూత్ అధ్యక్షులు బసవ పరమేశ్వర్ రెడ్డి తెలిపారు. స్థానిక శాసనసభ్యులు మామిడి గోవిందరావు ఆదేశాలతో ఎక్కడ ఎవరికి ఎటువంటి నీటి సమస్య రాకూడదని, ప్రజా ప్రతినిధులు అధికారులు సమన్వయంతో వ్యవహరించి త్రాగునీటి కొరత ఉన్న ప్రాంతాల ప్రజలకు త్రాగునీరు అందించాలనే ఆదేశాల మేరకు మంచినీటిని ట్యాంకర్ల ద్వారా అందించే క్రమంలో ముస్లిం వీధి తదితర వీధుల్లో ప్రజలకు మీరు అందించడం జరిగిందన్నారు.

## నరసన్నపేటకు చేరిన ఓటర్ల గణన పత్రాలు

**నరసన్నపేట, జూన్ 14 (వార్త):** స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) కార్యక్రమం నిర్వహణకు అవసరమైన ఓటర్ల గణన పత్రాలు నరసన్నపేటకు చేరుకున్నట్లు తహశీల్దార్ సత్యనారాయణ తెలిపారు. ఆదివారం ఉదయం నరసన్నపేట తహశీల్దార్ కార్యాలయానికి ఈ పత్రాలు చేరుకున్నాయని ఆయన వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అందిన గణన పత్రాలను వెంటనే సంబంధిత మండలాలకు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. నరసన్నపేట నియోజకవర్గ పరిధిలోని పోలాకి, జలుమూరు, సారవకోట మండలాలకు ఈ పత్రాలను తరలిస్తున్నామని చెప్పారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమంలో భాగంగా రేపటి నుంచి ఓటర్ల గణన ప్రక్రియ ప్రారంభం కానుందని వివరించారు. ఈ కార్యక్రమంలో బూత్ స్థాయి అధికారులు ఇంటింటికి వెళ్లి ఓటర్ల వివరాలను సేకరించి ధ్రువీకరణ చేపట్టనున్నట్లు తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరు తమ వివరాలను సక్రమంగా నమోదు చేసుకునేందుకు సహకరించాలని, కొత్త ఓటర్లు, చిరునామా మార్పులు, ఇతర సవరణలకు సంబంధించి అవసరమైన సమాచారం అందించాలని తహశీల్దార్ సూచించారు. ఎన్నికల ప్రక్రియను పారదర్శకంగా, సమగ్రంగా నిర్వహించేందుకు ఈ ప్రత్యేక సవరణ కార్యక్రమం దోహదపడుతుందని ఆయన పేర్కొన్నారు. ఓటర్ల జాబితాలో ఎటువంటి పొరపాట్లు లేకుండా ఖచ్చితమైన సమాచారం నమోదు చేయడానికి ప్రజలు అధికారులకు సహకరించాలని ఎన్నికల శాఖ అధికారులు విజ్ఞప్తి చేశారు.



# అభివృద్ధి, సంక్షేమంపై విస్తృత ప్రచారం చేయండి

* పలాస నియోజకవర్గ సమన్వయకర్త వెంకన్న చౌదరి
* నేతలు, కార్యకర్తలకు దిశానిర్దేశం

**పలాస, జూన్ 14 (వార్త):** ప్రజలకు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల గురించి పూర్తి స్థాయిలో అవగాహన కల్పించడం నేటి పరిస్థితుల్లో అత్యంత ముఖ్యమైన అంశం అని నియోజకవర్గ సమన్వయకర్త వెంకన్న చౌదరి కోరారు. పలాస టిడిపి కార్యాలయంలో సామాజిక మాధ్యమాల ద్వారా ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని ఆదివారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వాలు ప్రజల సంక్షేమం కోసం అనేక పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేస్తున్నప్పటికీ, వాటి గురించి సరైన సమాచారం ప్రతి కుటుంబానికి చేరుకోవడం అవసరమని అన్నారు. ఈ నేపథ్యంలో సామాజిక మాధ్యమాల ప్రతినిధులు, కార్యకర్తలు, ప్రజా ప్రతినిధుల అనుచరులు మరింత బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని తెలిపారు. సామాజిక మాధ్యమాలు ప్రస్తుతం ప్రజలతో నేరుగా అనుసంధానం కలిగించే అత్యంత ప్రభావవంతమైన వేదికలుగా మారాయని చెప్పారు. గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణాల వరకు ప్రతి ఒక్కరి చేతిలో స్మార్ట్‌ఫోన్ ఉండటంతో సమాచారం వేగంగా వ్యాప్తి చెందుతోందని, ఈ అవకాశాన్ని వినియోగించుకుని, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, మౌలిక వసతుల అభివృద్ధి, విద్య, వైద్యం, ఉపాధి, వ్యవసాయం, మహిళా సాధికారత వంటి రంగాల్లో జరుగుతున్న పురోగతిని, ప్రజలకు వివరించాల్సిన బాధ్యత సామాజిక మాధ్యమాల ప్రతినిధులపై ఉందని వెల్లడించారు. ప్రజలకు అందుతున్న లబ్ధి, నిర్మితమవుతున్న రహదారులు, సాగునీటి ప్రాజెక్టులు, విద్యా సంస్థలు, వైద్య సేవల విస్తరణ, ఉపాధి అవకాశాల కల్పన వంటి అంశాలను ఆధారాలతో సహా ప్రజలకు చేరవేయాలని కోరారు. ప్రభుత్వం చేపడుతున్న ప్రతి కార్యక్రమం వెనుక ఉన్న లక్ష్యం, దాని వల్ల సమాజానికి కలిగే ప్రయోజనాలను సరళమైన భాషలో వివరించడం ద్వారా ప్రజల్లో మరింత అవగాహన పెంపొందించవచ్చునని అన్నారు. ఇటీవలి కాలంలో కొన్ని రాజకీయ పార్టీలు, ప్రతిపక్ష నేతలు వాస్తవాలను వక్రీకరిస్తూ అసత్య ప్రచారాలకు పాల్పడుతున్నారని స్పష్టం చేసారు. సామాజిక మాధ్యమాల ద్వారా అసత్య సమాచారాన్ని వ్యాప్తి చేసి ప్రజల్లో గందరగోళం సృష్టించే ప్రయత్నాలు జరుగుతున్న నేపథ్యంలో, వాటిని వాస్తవాలు, ఆధారాలతో ఖండించడం అవసరమని, ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రచారాలకు దీటుగా సమాధానం ఇవ్వడం ద్వారా నిజాలను ప్రజల ముందుకు తీసుకురావాలని కోరారు. అయితే ఈ ప్రక్రియలో వ్యక్తిగత విమర్శలు, అసభ్యకర వ్యాఖ్యలు లేదా ద్వేషపూరిత ప్రచారాలకు తావు లేకుండా వ్యవహరించడం చాలా ముఖ్యమని, ప్రజాస్వామ్యంలో రాజకీయ భేదాభిప్రాయాలు సహజమైనవే అయినప్పటికీ, వాటిని విధానాల పరంగా చర్చించడం ఆరోగ్యకరమైన రాజకీయ సంస్కృతికి దోహదపడుతుందని చెప్పారు. ప్రభుత్వ విధానాలు, అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజా ప్రయోజనాల అంశాలపై ఆధారాలతో కూడిన చర్చలు జరగడం వల్ల ప్రజలకు సరైన సమాచారం అందుతుందని స్పష్టం చేశారు. కొంతమంది ప్రతిపక్ష నాయకులు తమ రాజకీయ ఉనికిని, చాటుకోవడానికి నిరాధార ఆరోపణలు, తప్పుడు కథనాలు ప్రచారం చేస్తున్న, ఇటువంటి సందర్భాల్లో భావోద్వేగాలకు లోనుకాకుండా వాస్తవాలను ప్రజలకు తెలియజేయడం, ప్రభుత్వ పనితీరును గణాంకాలు ఆధారాలతో వివరించడం మరింత ప్రభావవంతంగా ఉంటుంది. అభివృద్ధి కార్యక్రమాల ఫలితాలు, ప్రజలకు చేరిన లబ్ధి, అమలు అవుతున్న ప్రాజెక్టుల పురోగతి వంటి అంశాలను స్పష్టంగా ప్రజల ముందుంచడం ద్వారా అసత్య ప్రచారాలను సమర్థవంతంగా తిప్పికొట్టవచ్చునని తెలిపారు. సామాజిక మాధ్యమాల ప్రతినిధులు కేవలం రాజకీయ ప్రచారానికే పరిమితం కాకుండా ప్రజలకు ఉపయోగపడే సమాచారం అందించే వారధిగా పనిచేయాలని, ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించడం, ప్రజల సందేహాలకు సమాధానాలు ఇవ్వడం, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల దృష్టికి తీసుకురావడం, వాస్తవాలను ఆధారాలతో తెలియజేయడం ద్వారా సమాజంలో సానుకూల చైతన్యం తీసుకురావచ్చునని అన్నారు. ప్రజల సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధి, వాస్తవ సమాచార వ్యాప్తి లక్ష్యంగా సామాజిక మాధ్యమాలను సద్వినియోగం చేసుకుంటే ప్రజాస్వామ్య వ్యవస్థ మరింత బలోపేతం అవుతుందని, ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజలకు చేరవేయడంతో పాటు అసత్య ప్రచారాలను వాస్తవాలతో ఖండిస్తూ, బాధ్యతాయుతమైన సమాచార వేదికలుగా సామాజిక మాధ్యమాలు ముందుకు సాగాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఈ సమావేశంలో పలాస నియోజవర్గ కూటమి నాయకులు, పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# విహార కేంద్రంగా జగన్నాథ్ సాగర్

* ఎమ్మెల్యే గౌతు శిరీష



**పలాస, జూన్ 14 (వార్త):** పలాస మున్సిపాలిటీ పరిధిలోని ప్రముఖ జగన్నాథ్ సాగర్ గట్టును విహార కేంద్రంగా తయారుచేసే పనులకు శ్రీకారం చుట్టామని, స్థానిక ప్రజల ఎన్నో ఏళ్ల ఆకాంక్ష మేరకు జగన్నాథ్ సాగర్ గట్టును ఆధునిక హంగులతో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దేందుకు అధికారుల కృషి చేయడం జరిగిందని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష వెల్లడించారు. ఈ నేపథ్యంలో పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావుతో కలిసి జగన్నాథ్ సాగర్ గట్టు పరిసర ప్రాంతాలను ఆదివారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. చేపట్టాల్సిన అభివృద్ధి పనులు, సుందరీకరణ ప్రణాళికలపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గౌతు శిరీష మాట్లాడుతూ జగన్నాథ్ సాగర్ గట్టును ప్రజలకు ఆహ్లాదకరమైన విహార కేంద్రంగా మార్చేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని తెలిపారు. సోమవారం నుంచి అభివృద్ధి పనులను అధికారికంగా ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. చాలా కాలంగా ఎదురుచూస్తున్న ఈ ప్రాజెక్టుకు అడుగులు పడుతుండటంతో పలాస పట్టణ ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకుల, మున్సిపల్ సిబ్బంది, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పలాస జర్నలిస్ట్ అసోసియేషన్ ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గం

**పలాస, జూన్ 14 (వార్త):** పలాస జర్నలిస్ట్ అసోసియేషన్ ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గ ఎన్నికలు ఆదివారం స్నేహపూర్వక వాతావరణంలో నిర్వహించగా, సభ్యులందరి ఏకగ్రీవ మద్దతుతో సీనియర్ జర్నలిస్టు సి.హెచ్.నేతాజీ మూడోసారి అధ్యక్షుడిగాను, రెండవసారి సంపతిరావు జయంత్ కుమార్ సెక్రటరీగాను, మొదటిసారి రత్నాల రమేష్ ట్రెజరర్‌గాను ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల నిర్వాహకులు ప్రకటించారు. ఈసందర్భంగా నూతనంగా ఎన్నికైన అధ్యక్షుడు సి.హెచ్.నేతాజీ మాట్లాడుతూ జర్నలిస్టుల సంక్షేమమే తమ ప్రథమ లక్ష్యమని తెలిపారు. పలాస ప్రాంతంలోని విలేకరుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కార్యాచరణ రూపొందించి, జర్నలిస్టుల హక్కుల పరిరక్షణకు కృషి చేస్తామని చెప్పారు. ప్రెస్ క్లబ్‌ను మరింత బలోపేతం చేయడంతో పాటు సభ్యులందరికీ అందుబాటులో ఉండే విధంగా కార్యాచరణ చేపడతామని వెల్లడించారు. జర్నలిస్టులకు అవసరమైన సంక్షేమ పథకాలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లడం, హెల్త్ కార్డులు, బీమా సదుపాయాలు, అక్రిడిటేషన్ సమస్యలు, నివాస స్థలాల కేటాయింపు వంటి అంశాలపై ప్రత్యేకంగా పోరాడతామని ఆయన స్పష్టం చేశారు. యువ జర్నలిస్టులకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించి వృత్తి నైపుణ్యాలను పెంపొందించే చర్యలు చేపడతామని పేర్కొన్నారు. సెక్రటరీగా ఎన్నికైన సంపతిరావు జయంత్ కుమార్ మాట్లాడుతూ ప్రెస్ క్లబ్ కార్యకలాపాలను మరింత చురుకుగా నిర్వహించేందుకు కృషి చేస్తానని తెలిపారు. జర్నలిస్టుల మధ్య ఐక్యతను పెంపొందించి, వృత్తిపరమైన సమస్యల పరిష్కారానికి సంఘం తరఫున ముందుండి పనిచేస్తానని అన్నారు. ట్రెజరర్‌గా ఎన్నికైన రత్నాల రమేష్ మాట్లాడుతూ ప్రెస్ క్లబ్ ఆర్థిక వ్యవహారాల్లో పారదర్శకత పాటిస్తూ,సభ్యుల సంక్షేమ కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు. సంఘానికి అవసరమైన వనరుల సమీకరణకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈఎన్నికల సందర్భంగా పలాస జర్నలిస్టు అసోసియేషన్ సభ్యులు నూతన కార్యవర్గాన్ని అభినందించారు. అనంతరం నూతనంగా ఎన్నికైన అధ్యక్షుడు, సెక్రటరీ,ట్రెజరర్‌లను సభ్యులు శాలువాలు కప్పి పుష్పగుచ్ఛాలు అందజేసి సన్మానించారు.




### జోరువానలో లబ్ధిదారుడి

# ఇంటికి ఎమ్మెల్యే

* బాధితులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందించిన కూన రవి కుమార్
* ఆందోళన వద్దు అండగా ఉంటామని హామీ



**సరుబుజ్జిలి, జూన్ 14 (వార్త):** జోరువానలో లబ్ధిదారుడి ఇంటికే వెళ్లి సీఎంఆర్ఎఫ్ చెక్కు ఎమ్మెల్యే కూన రవికుమార్ ఆదివారం అందజేశారు. సరుబుజ్జిలి మండలంలోని పాలవలస గ్రామానికి సంబంధించిన కరణం రమాదేవి రాజాం పట్టణంలోని నివాసముంటున్నారు. ఆ కుటుంబానికి ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా రూ.76,900 మంజూరైంది. ఆ చెక్కును లబ్ధిదారుడి ఇంటికి ఎమ్మెల్యే వెళ్లి అందజేశారు. ప్రజలకు అవసరమైన సమయంలో అండగా నిలవడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమన్నారు. కష్టాల్లో ఉన్న కుటుంబాలకు ప్రభుత్వ సహాయాన్ని చేరవేయడంలో ఎలాంటి పరిస్థితులైనా వెనుకడుగు వేయబోమని స్పష్టం చేశారు. అలాగే ఆమదాలవలస మండలంలో కొర్లకోట గ్రామానికి చెందిన అంపోలు మీనా కుమారికి 52,000 రూపాయల ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి మంజూరైంది. ఆ చెక్కును ఎమ్మెల్యే కూన రవికుమార్ మీనా కుమారి ఇంటికి వెళ్లి అందజేశారు. ఆయన వెంట టీడీపీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు ఉన్నారు.



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## వీహెచ్‌పీ కార్యకర్తలకు శిక్షణ



**ఇచ్ఛాపురం, జూన్14 (వార్త):** శ్రీకాకుళం బలగలోని బాల త్రిపుర సుందరి భైరవ పీఠంలో ఈ నెల 12 నుంచి 14 వరకు శ్రీకాకుళం జిల్లా విశ్వాహిందూ పరిషత్ ఆధ్వర్యంలో విశ్వహిందూ పరిషత్ జిల్లా పెద్దలు కార్య కర్తల శిక్షణ శిబిరం నిర్వహించడం జరిగింది. ఇచ్ఛాపురం ప్రఖండ సభ్యులు పాల్గొన్నారు. బాల త్రిపుర సుందరి శక్తి పీఠం వ్యవస్థాపకులు గణేష్ గురూజీ హిందువులు ఎలా జీవించాలి తదితర అంశాలపై వివరించారు. ఉత్తర ఆంధ్ర కార్యదర్శి సుబ్బరాజు పరిషత్ ఎలా అభివృద్ధి చెందాలన్న దానిపై తెలియజేశారు. ఉత్తరాంధ్ర ప్రచారక్ ఎస్. పాల్గొనరావు కార్యక్రమాలు నిర్వహణపై అవగాహన కల్పించారు. జిల్లా అధ్యక్షులు అందరావు కార్యకర్తలు అందరు క్రమశిక్షణతో ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఇచ్ఛాపురం ప్రఖండ సభ్యులు పాక తులసి దాస్ రెడ్డి, సదాశివుని శ్రీనివాస్ రావు, ఉల్లాసి శ్యామ్ కుమార్, రెడ్డి లోపింటి సత్యం, ఆశీ జగన్ మోహన్ రెడ్డి, రావి విజయలక్ష్మి పాల్గొన్నారు.

# కూటమి రెండేళ్ల పాలనలో అభివృద్ధి

### * ఆంధ్రప్రదేశ్ ప్రజలకు సంక్షేమం జనసేన పార్టీ జిల్లా కార్యదర్శి మజ్జి భాస్కరరావు



**మందస, జూన్ 14(వార్త):** జనసేన పార్టీ అధినేత, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ రాష్ట్ర ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని తీసుకున్న చారిత్రాత్మక నిర్ణయాల ఫలితంగానే నేడు ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి పథంలో వేగంగా ముందుకు సాగుతోందని జనసేన పార్టీ జిల్లా కార్యదర్శి భాస్కరరావు మజ్జి అన్నారు. మందస మండలంలోని హరిపురంలో ఆదివారం భాస్కరరావు విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రయోజనాల కోసం రాజకీయ స్వార్థాలను పక్కనపెట్టి భారతీయ జనతా పార్టీని ఒప్పించి కూటమి ఏర్పాటుకు పవన్ కళ్యాణ్ కీలకంగా వ్యవహరించారని, ఆ నిర్ణయం వల్లే నేడు కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి పూర్తి సహకారం అందిస్తూ పెట్టుబడులు, పరిశ్రమలు, మౌలిక వసతుల ప్రాజెక్టులు, ఉపాధి అవకాశాలు పెరిగే పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. ఉప ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత పవన్ కళ్యాణ్ గ్రామీణాభివృద్ధి, గిరిజన సంక్షేమం, పర్యావరణ పరిరక్షణ, పంచాయతీరాజ్ వ్యవస్థ బలోపేతంపై ప్రత్యేక దృష్టి సారించారని అన్నారు. “అడవితల్లి బాట” కార్యక్రమం ద్వారా దూర ప్రాంత గిరిజన గ్రామాలకు రహదారి సౌకర్యాలు కల్పిస్తూ, అభివృద్ధికి దూరంగా ఉన్న ప్రాంతాలను ప్రధాన స్రవంతిలోకి తీసుకురావడానికి కృషి చేస్తున్నారని తెలిపారు. జల్ జీవన్ మిషన్ ద్వారా ప్రతి కుటుంబానికి స్వచ్ఛమైన తాగునీరు అందించే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందని, గ్రామీణ ప్రజలు తాగునీటి కోసం పడుతున్న ఇబ్బందులకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా చర్యలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. పర్యావరణ పరిరక్షణ కోసం రాష్ట్రవ్యాప్తంగా కోటి మొక్కలు నాటే లక్ష్యంతో కార్యక్రమాలు చేపడుతూ, భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించేందుకు పవన్ కళ్యాణ్ గారు ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని తెలిపారు. నదులు, వాగులు, చెరువులు కాలుష్యానికి గురికాకుండా ఉండేందుకు ప్రణాళికాబద్ధమైన చర్యలు చేపడుతూ జలవనరుల సంరక్షణకు ప్రాధాన్యత ఇస్తున్నారని అన్నారు. అలాగే “పల్లె పండుగ” వంటి కార్యక్రమాల ద్వారా పంచాయతీల అభివృద్ధి, గ్రామ పరిశుభ్రత, మౌలిక సదుపాయాల కల్పన, ప్రజల భాగస్వామ్యంతో గ్రామీణాభివృద్ధిని వేగవంతం చేస్తున్నారని పేర్కొన్నారు. రహదారులు, తాగునీటి సౌకర్యాలు, వీధి దీపాలు, పారిశుద్ధ్య వ్యవస్థ, కమ్యూనిటీ భవనాలు వంటి మౌలిక సదుపాయాల కల్పనలో ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందన్నారు. పలాస నియోజకవర్గ అభివృద్ధి విషయానికి వస్తే ఎమ్మెల్యే గౌతు శిరీష ప్రతి గ్రామానికి, ప్రతి రైతుకు, ప్రతి కుటుంబానికి న్యాయం జరిగేలా పనిచేస్తున్నారని కొనియాడారు. రైతుల ప్రతి చేనుకూ సాగునీరు అందించాలనే సంకల్పంతో కృషి చేస్తున్నారని, ప్రజల మధ్యకు వెళ్లి సమస్యలను నేరుగా విని వాటి పరిష్కారానికి నిరంతరం శ్రమిస్తున్నారని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో ఇసుక, మట్టి, కంకర వంటి సహజ వనరుల అక్రమ రవాణా ద్వారా రాష్ట్ర సంపదను కొల్లగొట్టారని, ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అలాంటి అక్రమాలకు అడ్డుకట్ట వేస్తూ పారదర్శక పాలన అందిస్తోందని పేర్కొన్నారు. పలాస ప్రజలు ఎన్నో సంవత్సరాలుగా ఎదురుచూస్తున్న కాశీబుగ్గ రైల్వే గేట్ ఫ్లైఓవర్ నిర్మాణ పనులు పూర్తయ్యే దశకు చేరుకోవడం, రైల్వే స్టేషన్ ఆధునికీకరణకు చర్యలు, కేంద్ర విద్యాలయం ఏర్పాటుకు కృషి, కిడ్నీ బాధితులకు మెరుగైన వైద్యం అందించేందుకు కిడ్నీ రీసెర్చ్ ఆసుపత్రిలో అత్యాధునిక పరికరాల ఏర్పాటు వంటి అభివృద్ధి కార్యక్రమాల వెనుక ఎమ్మెల్యే గౌతు శిరీష నిరంతర కృషి ఉందని మజ్జి భాస్కరరావు తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వం, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ దూరదృష్టి, ఎమ్మెల్యే గౌతు శిరీష ప్రజాసేవా దృక్పథం కలిసి పలాస నియోజకవర్గంతో పాటు రాష్ట్ర అభివృద్ధికి బలమైన పునాది వేస్తున్నాయని ఆయన పేర్కొన్నారు.

## జేసీఐ ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం





**ఇచ్ఛాపురం, జూన్14 (వార్త):** ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని పురస్కరించుకుని జేసీఐ ఇచ్ఛాపురం ఆధ్వర్యంలో ద్వారకా హాస్పిటల్, గోర్జీ వీధి, ఇచ్ఛాపురంలో ఉద్దానం బ్లడ్ సెంటర్ సహకారంతో మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరానికి ప్రజల నుండి విశేష స్పందన లభించగా, మొత్తం 94 యూనిట్ల రక్తాన్ని సేకరించారు. మానవతా దృక్పథం మరియు సామాజిక బాధ్యతను ప్రతిబింబించే ఈ కార్యక్రమం ద్వారా స్వచ్ఛంద రక్తదానంపై అవగాహన పెంపొందించి, ప్రాణాలను కాపాడే మహోన్నత సేవకు ప్రోత్సాహం లభించింది. ఈ కార్యక్రమాన్ని జేసీఐ ఇచ్ఛాపురం అధ్యక్షుడు జేఎఫ్ఎం బోయిన శ్రావణ్, కార్యదర్శి జేసీ డా. సంతోష్ సాహు, ప్రాజెక్ట్ చైర్మన్ జేఎఫ్‌డీ తంగుడు షణ్ముఖ్ నాయకత్వంలో నిర్వహించారు. సభ్యులు జేసీ పవన్, జేసీ రాహుల్, జేసీ ధర్మరాజ్ రెడ్డి, జేసీ దినేష్, సీహెచ్ రేణుక, అభిలాష్ వజ్రపు, వై. నరేష్, కొంచాడ మల్లేష్, వేచా సంతోష్, వేచా నీలిమ, శిరీషా దాస్, తిప్పాన మోహన్ వెంకటేష్, డా.మట్టా శ్రీనివాస్ కార్యక్రమం విజయవంతానికి విశేషంగా సహకరించారు. ఈ రక్తదాన శిబిరాన్ని ఉల్లాల భారతి దివ్య, వేచా సంతోష్, వేచా నీలిమ, తిప్పాన మోహన్ వెంకటేష్, డా. మట్టా శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ శిబిరంలో 12 మంది మహిళలు రక్తదానం చేయడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అలాగే ఒక దివ్యాంగుడు రక్తదానం చేసి అందరికీ స్ఫూర్తిదాయకంగా నిలిచారు. రక్తదాతలను ప్రోత్సహించేందుకు జేసీఐ ఇచ్ఛాపురం తరఫున స్టీల్ వాటర్ బాటిల్స్, మెడల్స్, సర్టిఫికెట్లు మరియు ఒక నెల ఉచిత ఆన్‌లైన్ యోగా శిక్షణ అందజేశారు. ప్రతి రక్తదాతకు ప్రత్యేక శ్రద్ధతో సేవలు అందించడంతో వారు నిర్వాహకులను అభినందించారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు జేఎఫ్ఎం బోయిన శ్రావణ్ మాట్లాడుతూ, కార్యక్రమం విజయవంతం కావడానికి సహకరించిన రక్తదాతలు, ముఖ్య అతిథులు, సభ్యులు, ద్వారకా హాస్పిటల్ యాజమాన్యం మరియు ఉద్దానం బ్లడ్ సెంటర్ ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు.సమాజ సేవే లక్ష్యంగా ముందుకు సాగుతున్న జేసీఐ ఇచ్ఛాపురం భవిష్యత్తులో కూడా ప్రజలకు ఉపయోగపడే మరిన్ని సేవా కార్యక్రమాలను నిర్వహించేందుకు కట్టుబడి ఉందని తెలిపారు.

## వైఎస్సార్టీఎఫ్ రాష్ట్ర కార్యదర్శిగా తేజేశ్వరరావు



**పోలాకి, జూన్ 14 (వార్త):** వైఎస్సార్ ట్రేడ్ అండ్ ఫ్రంటల్ విభాగం (వైఎస్సార్టీఎఫ్) రాష్ట్ర కార్యదర్శిగా నియమితులైన తేజేశ్వరరావు ఆదివారం పోలాకి మండలం మబగాంలోని క్యాంపు కార్యాలయంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఉప ముఖ్యమంత్రి ధర్మాన కృష్ణదాస్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తేజేశ్వరరావుకు అభినందనలు తెలిపిన ధర్మాన కృష్ణదాస్, పార్టీ అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. పార్టీ కార్యకలాపాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో చురుకైన పాత్ర పోషించాలని ఆకాంక్షించారు. అనంతరం సారవకోట మండలానికి చెందిన ముఖ్య నాయకులు, కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో ధర్మాన కృష్ణదాస్ మాట్లాడారు. ఎన్నికల సంఘం సోమవారం నుంచి వచ్చే నెల వరకు ప్రత్యేక సారాంశ సవరణ కార్యక్రమాన్ని నిర్వహించనున్న నేపథ్యంలో పార్టీ బూత్ స్థాయి ఏజెంట్లు (బీఎల్ఏలు) అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సమావేశంలో సారవకోట మండలానికి చెందిన వైసీపీ నాయకులు, బీఎల్ఏలు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## సీఎం చంద్రబాబును కలిసిన సోంపేట పిఎస్ఐ సేవా సంస్థ చైర్మన్



**సోంపేట జూన్ 14(వార్త):** సోంపేట మండలం పాలవలస గ్రామానికి చెందిన పి ఎస్ ఐ సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు, చైర్మన్ గార బాబురావు సింగపూర్ పర్యటనలో ఉన్న ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును మర్యాదపూర్వకంగా ఆదివారం కలిశారు. పాలవలస గ్రామంలో పేదలు, అనాధలు, అభాగ్యులకు ఆశ్రయం కల్పించేందుకు పి ఎస్ ఐ సేవా సంస్థ ఆధ్వర్యంలో ఆశ్రమం నిర్మించేందుకు 50 సెంట్ల స్థలం కేటాయించాలని సీఎంకు వినతిపత్రం అందజేశారు.

# హిందూ ధర్మ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

### * బ్రహ్మశ్రీ లక్ష్మీనారాయణశర్మ * శ్రీ రామయోగి బాబా ఆశ్రమంలో ఆధ్యాత్మిక సత్సంగ సభ



**పోలాకి, జూన్14(వార్త):** చింతాడపేట గ్రామంలోనిరామయోగిబాబా ఆశ్రమంలో ఆదివారం నిర్వహించిన ఆధ్యాత్మిక సత్సంగ సభ భక్తి, ఆధ్యాత్మికచింతనలతో సాగింది. ఈ కార్యక్రమంలో ప్రముఖ ప్రవచకులు బ్రహ్మశ్రీ బంకుపల్లి లక్ష్మీనారాయణశర్మ పాల్గొని ఆధ్యాత్మిక సందేశాలను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, హిందూ ధర్మ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని ఉద్ఘాటించారు. ఆధునిక జీవనశైలిలోనూ ధార్మిక విలువలను పాటిస్తూ సనాతన సంప్రదాయాలను కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కుటుంబంలో చిన్ననాటి నుంచే పిల్లలకు నైతిక విలువలు, ధార్మిక ఆచారాలపై అవగాహన కల్పించాలని సూచించారు. భగవద్గీత, శ్రీమద్భాగవతం, మహాభారతం వంటి మహోన్నత గ్రంథాలను క్రమం తప్పకుండా అధ్యయనం చేయడం ద్వారా వ్యక్తిత్వ వికాసంతో పాటు మానసిక ప్రశాంతత లభిస్తుందని తెలిపారు. ఈ గ్రంథాల్లోని సందేశాలు జీవితానికి మార్గదర్శకంగా నిలుస్తాయని పేర్కొన్నారు. బమ్మిడి విశ్వనాథం అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ప్రవచనాలను ఆసక్తిగా విన్న భక్తులు ధార్మిక విషయాలపై తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు. ఆశ్రమంలో నిర్వహించిన ఈ సత్సంగ సభ ఆధ్యాత్మిక వాతావరణంలో భక్తులను ఆకట్టుకుంది. కార్యక్రమం అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

# ప్రభుత్వ పాఠశాలలో పారిశుద్ధ్య పనులు

### * జంగిల్ క్లియరెన్స్‌తో పరిశుభ్రంగా మారిన పాఠశాల ప్రాంగణం * ఉపాధి హామీ కార్మికులతో పిచ్చిమొక్కల తొలగింపు



**నరసన్నపేట, జూన్ 14 (వార్త):** నరసన్నపేట మండలం దేవాది ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ప్రాంగణంలో పారిశుద్ధ్య పనులతో పాటు జంగిల్ క్లియరెన్స్ కార్యక్రమాన్ని చేపట్టినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వీర్రాజు తెలిపారు. ఆదివారం ఉదయం పాఠశాల ఆవరణలో నిర్వహించిన ప్రత్యేక పరిశుభ్రత కార్యక్రమంలో భాగంగా పిచ్చిమొక్కలు, పనికిరాని పొదలను తొలగించినట్లు ఆయన పేర్కొన్నార. పాఠశాల ప్రాంగణాన్ని పరిశుభ్రంగా, ఆహ్లాదకరంగా ఉంచాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. ఉపాధి హామీ పథకం కింద పనిచేస్తున్న కార్మికుల సహకారంతో పాఠశాల ఆవరణలో పెరిగిన కలుపు మొక్కలను పూర్తిగా తొలగించామని చెప్పారు. విద్యార్థులకు పరిశుభ్రమైన వాతావరణంలో విద్యాభ్యాసం అందించేందుకు పాఠశాల పరిసరాల పరిశుభ్రతకు ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తున్నట్లు హెచ్ఎం వీర్రాజు తెలిపారు. వర్షాకాలం సమీపిస్తున్న నేపథ్యంలో పాఠశాల ఆవరణలో నీరు నిల్వ ఉండకుండా, దోమలు వ్యాప్తి చెందకుండా ముందస్తు చర్యలలో భాగంగా ఈ పనులు చేపట్టినట్లు వివరించారు. పరిశుభ్రమైన పాఠశాల వాతావరణం విద్యార్థుల ఆరోగ్యానికి, విద్యాభ్యాసానికి ఎంతో దోహదపడుతుందని ఆయన పేర్కొన్నారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి కార్యక్రమాలను నిరంతరం నిర్వహించి పాఠశాల పరిసరాలను స్వచ్ఛంగా ఉంచేందుకు చర్యలు కొనసాగిస్తామని తెలిపారు.

## శిష్టకరణాలను ఓబీసీ జాబితాలో చేర్చాలి



**నరసన్నపేట, జూన్ 14(వార్త):** శిష్టకరణాలను ఇతర వెనుకబడిన వర్గాల (ఓబీసీ) జాబితాలో చేర్చేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలని నరసన్నపేట శిష్టకర్ణం సంఘం డిమాండ్ చేసింది. స్థానికంగా నిర్వహించిన సంఘ సమావేశం అధ్యక్షుడు సదాశివ రాంబాబు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా సభ్యులు మాట్లాడుతూ, శిష్టకరణలను ఓబీసీ జాబితాలో చేర్చే అంశాన్ని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరపు రామ్ మోహన్ నాయుడు, రాష్ట్ర మంత్రి కింజరపు అచ్చెన్నాయుడు, నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి దృష్టికి తీసుకెళ్లాలని సమావేశంలో తీర్మానించారు. ఓబీసీ హోదా సాధనకు సహకరిస్తున్న కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడుకు సంఘం తరఫున ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తూ మరో తీర్మానం ఆమోదించారు. తమ సమస్యల పరిష్కారానికి ప్రజాప్రతినిధులు సానుకూలంగా స్పందించాలని కోరారు. అలాగే ప్రతి శిష్టకరణ కుటుంబం ఎస్ఐఆర్ కార్యక్రమంలో పాల్గొని తమ ఓటరు నమోదు వివరాలను పరిశీలించుకోవాలని సమావేశంలో సూచించారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు అత్యంత కీలకమని, ప్రతి ఒక్కరూ తమ పేర్లు ఓటరు జాబితాలో ఉన్నాయో లేదో నిర్ధారించుకోవాలని పిలుపునిచ్చారు. సంఘ బలోపేతానికి ప్రతి సభ్యుడు కృషి చేయాలని, భవిష్యత్తులో నిర్వహించే సమావేశాలు, కార్యక్రమాలకు సకాలంలో హాజరై విజయవంతం చేయాలని నాయకులు కోరారు. ఈ సమావేశంలో ప్రధాన కార్యదర్శి గోవిందరావు, బలివాడ కృష్ణారావు, కస్పా ప్రసాద్, సదాశివ సింహాచలం, చౌదరి కాంతారావు, ప్రసాద్, కుప్పిలి వైకుంఠరావు, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

# పూర్వ విద్యార్థుల.. అపూర్వ కలయిక

**ఇచ్ఛాపురం, జూన్ 14 (వార్త):2020-21** టెన్త్ క్లాస్ బ్యాచ్ ఇచ్ఛాపురం వి జే గ్రాండ్ లాడ్జిలో పూర్వ విద్యార్థులు కలియక నిర్వహించారు. కార్యక్రమంలో 70 మంది పూర్వ విద్యార్థులు 20 మంది పూర్వ అధ్యాపకులు కి ఘనంగా ఘనంగా సన్మానించారు. ఇచ్ఛాపురం ఉన్నత పాఠశాలకి పాఠశాలకి 15 వేలు రూపాయలు వెచ్చించి ఒక బీరువా బహుకరించారు. కళాశాలలో చెట్లు నాటారు. విద్యార్థులు పూర్వ జ్ఞాపకాలు జ్ఞాపకం చేసుకొని ఆనందంగా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ1 విశ్వనాథం, పూర్వ అధ్యాపకులు కేశవరావు, మోహన్ రావు, పూర్వ విద్యార్థులు గువ్వాడ ప్రదీప్ కుమార్, మధు,రాజేష్, అయ్యప్ప, సంతోష్, రవి, మాధవ్, శ్రీకాంత, మోషే, ఉదయ్, హేమసుందర్ ,రమేష్, లక్ష్మీ కాంత్ , పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.





## పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక

**నరసన్నపేట, జూన్ 14 (వార్త):** నరసన్నపేట మండలం ఉర్లాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో 1987-88 విద్యా సంవత్సరానికి చెందిన 10వ తరగతి పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక సమావేశం ఆదివారం ఘనంగా నిర్వహించారు. దాదాపు 100 మంది పూర్వ విద్యార్థులు ఒకే వేదికపై కలుసుకుని ఆనాటి జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ ఆనందభరిత క్షణాలను పంచుకున్నారు. దశాబ్దాల అనంతరం మళ్లీ కలుసుకున్న సహపాఠులు పరస్పరం ఆప్యాయంగా పలకరించుకుని తమ విద్యార్థి దశలోని అనుభవాలను గుర్తుచేసుకున్నారు. పాఠశాల అభివృద్ధికి, తమ జీవితాలకు బాటలు వేసిన గురువులను ప్రత్యేకంగా సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ, తమ విజయాలకు గురువులే పునాది అని పేర్కొన్నారు. పాఠశాల రోజుల్లోని మధుర జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ ఆనందం వ్యక్తం చేశారు. గురువులు కూడా తమ పూర్వ విద్యార్థులను ఒకే వేదికపై చూడడం సంతోషంగా ఉందని తెలిపారు. కార్యక్రమంలో ఆటలు, పాటలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి అందరినీ అలరించారు. ఆనాటి గురువులు, విద్యార్థులతో కూడిన ప్రత్యేక ఫోటోను జ్ఞాపికగా ముద్రించి ప్రతి ఒక్కరికీ అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రాంగణం పూర్వ విద్యార్థుల సందడి, ఆప్యాయతలతో కళకళలాడింది. పునర్మిళన కార్యక్రమం స్నేహబంధాలను మరింత బలోపేతం చేయడంతో పాటు భవిష్యత్తులో కూడా ఇలాంటి సమావేశాలు నిర్వహించాలని పూర్వ విద్యార్థులు నిర్ణయించారు. కార్యక్రమం అనంతరం అందరూ కలిసి భోజనం చేసి ఆనందంగా గడిపారు.

## ఐఐటికి విద్యార్థుల ఎంపిక పట్ల హర్షం




**పలాస, జూన్ 14 (వార్త):** కాశీబుగ్గ జడ్పీ హైస్కూల్‌కు చెందిన 14 మంది విద్యార్థులు నూజివీడు, శ్రీకాకుళం ఐఐటీలకు ఎంపికయ్యారని హెచ్ఎం చిన్నమ నాయుడు తెలిపారు. నూజివీడు ఐఐటికి పూజారి కీర్తిపండా, ఎల్ నిహార్, తమ్మినేని నవ్య శ్ర, పూర్ణచంద్రరావు, ప్రతిభ పాత్రో, మనోజ్ కుమార్, మార్పు కీర్తనలు ఎంపిక అయ్యారని, ఒంగోలు క్యాంపస్ కి భాగ్యలక్ష్మి తాళాసు సాయివర్షితలు ఎంపికయ్యారన్నారు. శ్రీకాకుళం క్యాంపస్ కి సింహాద్రి సహస్ర, పొట్నూరు వర్షిత్, జోగి సంగీత, వెలమాన కార్తీక్, హాస్యా ఎంపికయ్యారని తెలిపారు. వీ రందరికి హెచ్ ఎం, ఉపాధ్యాయులు అభినందించారు.

## ట్రిపుల్ ఐటీలో కృష్ణాపురం జడ్పీహెచ్ఎస్ విద్యార్థి ధనుష్ ప్రతిభ



**మందస, జూన్ 14(వార్త):** మందస మండలంలోని కృష్ణాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి ధనుష్ బెహరా ట్రిపుల్ ఐటీకు ఎంపికై సత్తా చాటాడు. పదవ తరగతిలో 589 మార్కులు సాధించిన ధనుష్ బెహరా నూజివీడు ట్రిపుల్ ఐటీకు ఎంపికయ్యాడు. విద్యార్థి సాధించిన విజయం పట్ల పాఠశాల హెచ్ఎం పి.మన్మథరావు, ఉపాధ్యాయ బృందం, స్థానికులు అభినందనలు వ్యక్తపరిచారు.

## పొత్తంగి-సిరిపురం విద్యార్థుల విజయదుందుభి



ట్రిపుల్ ఐటీ ఫలితాలలో మందస మండలంలోని పొత్తంగి-సిరిపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు విజయదుందుభి మ్రోగించారు. ఈ పాఠశాలలో మొత్తం నలుగురి విద్యార్థులు అర్హత సాధించారు. వారిలో నందిని మల్లికో. ఈమె 10వ తరగతి ఫలితాల్లో 585 మార్కులు సాధించి ఐఐఐటి నూజివీడులో సీటును సాధించింది. తల్లిదండ్రులు పూర్ణచంద్ర మల్లికో, మల్లి మల్లికో. హెున్నాళి గ్రామం. వీరిది వ్యవసాయ కుటుంబం. ఈమె సివిల్ సర్వీస్ సాధించాలనే లక్ష్యంతో ఉంది. తర్వాత కురేష్ లెంక తల్లిదండ్రులు మగుని లెంక, కోయింట లెంక. వీరిది కూడా హెున్నాళి గ్రామం. ఈ విద్యార్థి మంచి ఇంజనీర్ కావాలనే లక్ష్యంతో ఉన్నారు. పొట్టి ఢిల్లేశ్వరి. తల్లిదండ్రులు నిరాకర్, రాజకుమారి వీరిది వ్యవసాయ కుటుంబం. బెల్లు పటియా గ్రామం. ఈమె కూడా మంచి ఇంజనీర్ కావాలనే లక్ష్యంతో ఉన్నారు. అదేవిధంగా గాయత్రి బెహరా తల్లిదండ్రులు దయానిధి బెహరా, సుస్మిత బెహరా. వీరిది భోగాపురం గ్రామం. ఈమె కూడా మంచి ఇంజనీర్ కావాలని లక్ష్యంతో ఉన్నారు. ఈ ముగ్గురు విద్యార్థులు త్రిబుల్ ఐటీ శ్రీకాకుళంలో సీటును సంపాదించారు. ఈ విజయం సాధించిన పాఠశాల విద్యార్థులకు ప్రధానోపాధ్యాయుడు ఎన్.తారకేశ్వరరావు, తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ ఎ.సుజాత, ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బంది అభినందనలు తెలిపారు.

## పర్యావరణ పరిరక్షణతోనే మానవ మనుగడ

**మందస, జూన్ 14(వార్త):** మొక్కలను నాటి సంరక్షించడం అంటే కేవలం పర్యావరణాన్ని కాపాడటం మాత్రమే కాదని, భూమిపై జీవాన్ని కాపాడటమేనని ప్రముఖ సమాజసేవకులు, వ్యాపారి వడ్డి చంద్రశేఖరం అన్నారు. మందస పట్టణంలోని ఆదివారం బజారు జంక్షన్ వద్ద ‘గో గ్రీన్’ సంస్థ, ‘ఎస్.ఎం.ఆర్. ఫౌండేషన్’ సంయుక్తంగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఉత్సాహంగా నిర్వహించాయి. ఈ సందర్భంగా వడ్డి అమ్మన్న, సోమేశ్వరరావు కలిసి మొక్కలు నాటారు. అనంతరం నాటిన మొక్కల రక్షణ కోసం వడ్డి చంద్రశేఖరం ప్రత్యేకంగా బహుకరించిన ఐరన్ ట్రీ గార్డులను మొక్కలకు అమర్చారు. ఈ సందర్భంగా వడ్డి చంద్రశేఖరం మాట్లాడుతూ “భూగర్భ జలాలు పెరగడానికి, సకాలంలో వర్షాలు పడటానికి, గ్లోబల్ వార్మింగ్(భూతాపం) తగ్గడానికి చెట్లు అత్యంత కీలకమైన వనరు, ప్రకృతిని కాపాడుకోవడానికి చెట్లను పెంచడం మినహా మరే ఇతర ప్రత్యామ్నాయంలేదని పేర్కొన్నారు. ప్రతీ ఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటి, వాటిని సంరక్షించాలన్నారు. మందసలో పర్యావరణ పరిరక్షణే ధ్యేయంగా చేపట్టిన ఈ హరిత కార్యక్రమం పట్ల, నిర్వాహకులు చూపిస్తున్న చొరవ పట్ల స్థానికులు, పలువురు ప్రముఖులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో గో గ్రీన్, ఎస్.ఎం.ఆర్ ఫౌండేషన్ ప్రతినిధులతో పాటు ప్రముఖులు ప్రభాకర పట్నాయక్, ఇప్పిలి వెంకటేశ్వరరావు, శ్రీనివాస్ పాడి, జగదీష్, స్థానిక వ్యాపారులు తదితరులు పాల్గొన్నారు.



జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



## హాస్టల్లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానం

**కంచిలి, జూన్14 (వార్త):** కంచిలిలో గల బీసీ బాలుర వసతి గృహంలో ప్రవేశాలకు విద్యార్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు హాస్టల్ సంక్షేమ అధికారి గుళ్ల రామారావు తెలిపారు. ఆరు నుంచి తొమ్మిదో తరగతి చదువుతున్న విద్యార్థులు అర్హులని పేర్కొన్నారు. చక్కని వాతావరణం, మంచి విద్యా ఫలితాలతో రానిస్తున్న కంచిలి బీసీ హాస్టల్లో విద్యార్థులకు చక్కని వసతి సౌకర్యాలు ఉన్నాయని అన్నారు. మంచి క్రమశిక్షణ తో కూడిన విద్య ఇక్కడ అందుబాటులో ఉందని అన్నారు. ఈ నెల 25 లోగా దరఖాస్తులు హాస్టల్ వద్ద అందజేయాలనీ కోరారు.

## రోడ్డు ప్రమాదంలో
## జానపద కళాకారుడు వాసుకు గాయం



**మందస, జూన్ 14(వార్త):** మందస మండలంలోని లొహరిబంద గ్రామానికి చెందిన జానపదకళాకారుడు, ఫోక్ సింగర్ నక్క వాసు ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. విజయనగరం వెళ్లుండగా.. గుర్ల వద్ద ఆటో ఢీకొనడంతో గాయపడ్డారు. దీంతో ఆయనను కెమ్స్ ఆసుపత్రిలో చేర్పించగా.. అక్కడనే చికిత్స పొందుతున్నారు. జానపదకళాకారుడు నక్క వాసుకు జరిగిన ప్రమాద సమాచారం తెలుసుకున్న స్థానిక కళాకారులు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయన త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

### నేటి నుంచి ఇంటింటికీ
## ఓటర్ల సవరణ సర్వే

- ✱ ప్రజలు పూర్తి సహకారం అందించాలి
- ✱ లోపరహిత ఓటరు జాబితా రూపకల్పనే లక్ష్యం
- ✱ జూలై 14 వరకూ ఈ సర్వే
- ✱ కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

**శ్రీకాకుళం, జూన్ 14 (వార్త):** జిల్లావ్యాప్తంగా సోమవారం నుంచి ప్రారంభం కానున్న ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ ఇంటింటి సర్వేకు ప్రజలంతా పూర్తి సహకారం అందించాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి స్వప్నిల్ దినకర్ పుండ్కర్ పిలుపునిచ్చారు. లోప రహిత, పారదర్శక ఓటరు జాబితా రూపకల్పనే లక్ష్యంగా భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం చేపట్టినట్లు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జూన్ 15 నుంచి జూలై 14 వరకు నెల రోజుల పాటు ఈ సర్వే సాగుతుందని వివరించారు. పోలింగ్ కేంద్రాల పరిధిలోని బూత్ లెవల్ అధికారులు, బూత్ లెవల్ ఏజెంట్లు ప్రతి ఇంటికీ వచ్చి అర్హులైన వారందరికీ ఎన్యూమరేషన్ ఫారాలు అందజేస్తారని, వాటిని సకాలంలో పూర్తి చేసి ఇవ్వాలని స్పష్టం చేశారు. ఓటరు జాబితాలో వివరాలు మ్యాపింగ్ కాని వారు, కొత్తగా చేరే వారు ఎన్యూమరేషన్ ఫారంతో పాటు అవసరమైన ధ్రువీకరణ పత్రాలను స్వీయ ధృవీకరణ చేసి బీఎల్ఓలకు సమర్పించాలని కలెక్టర్ ఆదేశించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు లేదా పెన్షనర్ల గుర్తింపు కార్డులు, పీపీఓ ఉత్తర్వులు, ఆధార్, పాస్‌పోర్ట్, జనన ధృవీకరణ పత్రం, విద్యార్హతలు, నివాస, కుల ధృవీకరణ పత్రాల్లో ఏదో ఒకటి జత చేయాలన్నారు. ప్రతి అర్హత కలిగిన పౌరుడు ఓటరుగా నమోదయ్యేలా క్షేత్రస్థాయి అధికారులు బాధ్యతగా పనిచేయాలని సూచించారు. సందేహాలుంటే సంబంధిత బీఎల్ఓలు, ఈఆర్ఓలు, ఏఈఆర్ఓలను సంప్రదించవచ్చని కలెక్టర్ తెలిపారు.

## వరాహ లక్ష్మీ నరసింహ స్వామి సన్నిధిలో కలెక్టర్





**శ్రీకాకుళం/విశాఖపట్నం, జూన్ 14 (వార్త):** శ్రీకాకుళం జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ దంపతులు ఆదివారం సింహాచలంలోని వరాహ లక్ష్మీ నరసింహ స్వామిని దర్శించుకున్నారు. ఆలయ కార్యనిర్వహణాధికారి జల్లేపల్లి వెంకట్రావు, ప్రధాన అర్చకులు శ్రీనివాసాచార్యులు ఆలయ సంప్రదాయాల మేరకు నాదస్వర మంగళవాయిద్యాలు, వేదమంత్రోచ్ఛారణల నడుమ వారికి ఘన స్వాగతం పలికారు. అనంతరం వారు క్షేత్ర మహిమాన్వితానికి ప్రతీకగా భావించే కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకుని, స్వామివారి సన్నిధిలో ప్రత్యేక దర్శనం చేసుకున్నారు. దర్శనానంతరం వేద పండితులు వేదఘోషల మధ్య ఆశీర్వచనాలు అందజేశారు. ఈ సందర్భంగా దేవస్థానం తరపున కలెక్టర్ దంపతులను శేషవస్త్రంతో సత్కరించి, స్వామివారి ప్రసాదాలు, జ్ఞాపికగా స్వామివారి చిత్రపటాన్ని అందజేశారు.

## పోటెత్తిన ఆదిత్యుని ఆలయం

**అరసవల్లి, జూన్ 14 (వార్త):** అరసవల్లి సూర్యనారాయణస్వామి దేవస్థానానికి ఆదివారం పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు. క్యూలైన్లు భక్తులతో కిటకిటలాడింది. స్వామి వారికి టికెట్లు రూపేనా రూ.2,66,000, పూజలు, విరాళాల రూపంలో రూ.34,798, ప్రసాదాల రూపంలో రూ.1,40,240లు, దర్శనం, సూర్యనమస్కారములు, వివిధ సేవలు మరియు ప్రసాదాల బుకింగ్‌ను మరింత సులభతరం చేస్తూ ఆన్‌లైన్ రిజర్వేషన్ ద్వారా మొత్తం రూపంలో రూ.1,57,765లు ఆదాయం వచ్చిందని ఆలయ ఈవో ప్రసాద్ తెలిపారు.


## యోగాతో శారీరక, మానసిక ఆరోగ్యం
### టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి బగ్గు అర్చన

**నరసన్నపేట, జూన్ 14 (వార్త):** నరసన్నపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో ఆదివారం నిర్వహించిన యోగ శిక్షణ శిబిరానికి విశేష స్పందన లభించింది. విద్యార్థులు, యువత, మహిళలు, వివిధ వర్గాల ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని యోగాభ్యాసం చేశారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి బగ్గు అర్చన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ప్రస్తుతం సాంకేతిక యుగంలో ప్రతి ఒక్కరూ సెల్‌ఫోన్‌లకు ఛార్జింగ్ పెట్టేందుకు ఎంత ప్రాధాన్యం ఇస్తున్నారో, అదే విధంగా మన శరీరం, మనస్సుకు కూడా నిరంతర శక్తి అవసరమని అన్నారు. ఆ శక్తిని యోగా ద్వారా పొందవచ్చని పేర్కొన్నారు. నిత్య జీవితంలో యోగాను భాగం చేసుకోవడం వల్ల శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ప్రశాంతత కూడా లభిస్తుందని చెప్పారు. ఒత్తిడితో కూడిన జీవనశైలిలో యోగా ప్రతి ఒక్కరికీ అవసరమని, యువత ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని అలవర్చుకోవాలని సూచించారు. యోగ గురువు రవి ఆధ్వర్యంలో వివిధ యోగాసనాలు, ప్రాణాయామ విధానాలపై శిక్షణ అందించారు. యోగాభ్యాసం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించడంతో పాటు ప్రతిరోజూ కొంత సమయం యోగాకు కేటాయించాలని సూచించారు. కార్యక్రమంలో పాల్గొన్న వారు యోగ శిక్షణను ఆసక్తిగా వీక్షించి అభ్యాసం చేశారు. యోగా ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని, ఇటువంటి శిబిరాలను మరింత విస్తృతంగా నిర్వహించాలని పలువురు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, ఉపాధ్యాయులు, యోగా సాధకులు పాల్గొన్నారు.



# వంశధార నీటి సాధనకు..
# పోరాటమే మార్గం

✱ ఉద్యమాల ద్వారానే పాలకులు దిగి వస్తారు ✱ వంశధార నీటిని ఇచ్ఛాపురం వరకూ అందజేయాలి ✱ పోరాట చరిత కలిగిన నేల హరిపురం ✱ పుల్లెల శ్యాంసుందర్, గౌతు లచ్చన్న, మార్పు పద్మనాభంలను స్ఫూర్తిగా తీసుకోవాలి ✱ సంయుక్త కిసాన్ మోర్చా ఏపీ కన్వీనర్ వ్యవసాయశాఖ మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు ✱ వలసలను నివారణకు వ్యవసాయ రంగాన్ని అభివృద్ధి చేయాలి ✱ అఖిల భారత కార్మిక సంఘాల సమాఖ్య జాతీయ ఉపాధ్యక్షులు ప్రసాద్ ✱ వంశధార జలసాధన కమిటీ ఆధ్వర్యంలో రైతులతో సదస్సు




**మందస, జూన్ 14(వార్త):** వంశధార నదీ జలాలను ఇచ్ఛాపురం వరకూ పొడిగించాలని కోరుతూ పలాస వంశధార జల సాధన కమిటీ ఆధ్వర్యంలో మార్పు మన్మథరావు అధ్యక్షతన హరిపురంలో ఆదివారం ఒక ప్రైవేట్ కళ్యాణ మండపంలో రైతులతో సదస్సు నిర్వహించారు. మాజీ వ్యవసాయ శాఖ మంత్రి, మాజీ పార్లమెంటు సభ్యులు, ఎస్ కే యం రాష్ట్ర కన్వీనర్ వడ్డే శోభనాద్రీశ్వరరావు ముఖ్య వక్తగా హాజరై సదస్సులో మాట్లాడారు. వంశధార నీరు ఇచ్ఛాపురం వరకు పొడిగిస్తే పలాస డివిజన్ మొత్తం పంటల పండి రైతుకు ఆదాయం వస్తుందని పేర్కొన్నారు. ఈ ప్రాంతంలో వలసలను నివారించి రైతుల జీవితాల్లో మార్పు రావాలంటే రైతులకు సాగునీరు అందివ్వాలన్నారు. ఈ ప్రాంతంలో ఉన్న చిన్న, మధ్య తరహా నీటి వనరులను ఉపయోగించుకుంటూనే వంశధార నదీ జలాలను లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా అందించాలని ఆయన డిమాండ్ చేశారు. లక్షల కోట్ల రూపాయలను పాలకులు వృధాగా బహుళ జాతి కంపెనీలకు రాయితీలుస్తుంటారు. బ్యాంకు అప్పులను ఎగ్గొట్టిన వాళ్ళకి రుణమాఫీ చేస్తుంటారు. రైతుకి ఇస్తే తప్పేంటి అని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వాలు ఆషామాషిగా వినవనీ పోరాడి పాలకుల మెడల వంచి సాధించుకోవాలన్నారు. శ్రీకాకుళం జిల్లా మందస గడ్డ హరిపురం నేల అంతా పోరాటాల చరిత్ర కలిగినదేనని చెప్పారు. రైతు ఉద్యమానికి నాయకత్వం వహించిన పుల్లెల శ్యాంసుందర్, గౌతు లచ్చన్న, మార్పు పద్మనాభం వంటి యోధాన యోధులను స్ఫూర్తిగా తీసుకోవాలని కొనియాడారు. అఖిల భారత కార్మిక సంఘాల సమాఖ్య జాతీయ ఉపాధ్యక్షులు పి.ప్రసాద్ మాట్లాడుతూ ఏడు దశాబ్దాలుగా ఈ ప్రాంతం నిరంతరం వలసలకు నిలయంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. వలసలను నివారించి స్థానికంగా ఉపాధిని కల్పించాలంటే వ్యవసాయ రంగాన్ని అభివృద్ధి చేయాలని పిలుపునిచ్చారు. వ్యవసాయం అభివృద్ధి అయితే వ్యవసాయ అనుబంధ పరిశ్రమలు ఏర్పడితే ఉపాధి అవకాశాలు మెరుగుపడడం ద్వారానే వలసలు నివారించగలమని ఆయన తెలిపారు. సదస్సులో హేమారావు చౌదరి, ధర్మార్పు వెంకటరావు, సోమనాదం, నల్లహడ్డి, వంకల మాధవరావు, సన్నశెట్టి రాజశేఖర్, డాక్టర్ ఖగేశ్వర రావు, బాబూరావు మాష్టరు తదితరులు మాట్లాడారు. సుమారు 500 మంది రైతాంగ ప్రతినిధులు హాజరైన ఈ సభలో పలు ప్రజా సంఘాల నాయకులు ప్రతినిధులు, అరుణోదయ, తదితర ప్రజా కళాకారులు పాల్గొని సభను ఉత్తేజ పరిచారు. సదస్సు అనంతరం భవిష్యత్తు కార్యాచరణను రూపొందించారు.



# మానసిక ఒత్తిడిని జయించేందుకు యోగా దోహదం

- ✱ రిమ్స్ ప్రభుత్వ వైద్య కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ బి. నాగేంద్ర నాయుడు
- ✱ రిమ్స్ సిబ్బందితో యోగాసనాలు

**శ్రీకాకుళం, జూన్ 14 (వార్త):** 'యోగా ఆంధ్ర 2026' వేడుకల్లో భాగంగా ఆదివారం ఉదయం శ్రీకాకుళం నగరంలోని కార్గిల్ పార్కులో రిమ్స్ ప్రభుత్వ వైద్య కళాశాల అధికారులు, సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొని యోగాసనాలు వేశారు. నిత్యం రోగుల సేవలో, వైద్య విధుల్లో తీరిక లేకుండా గడిపే వైద్య సిబ్బందికి శారీరక దృఢత్వం, మానసిక ఉల్లాసం ఎంతో అవసరమని, అందుకు యోగా చక్కటి మార్గమని అధికారులు పేర్కొన్నారు. ఈ శిక్షణ శిబిరంలో జిల్లా ఆయుష్ అధికారి డాక్టర్ ఉత్తం రాజ్ రాణా, రిమ్స్ ప్రభుత్వ వైద్య కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ బి. నాగేంద్ర నాయుడు, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ కీర్తి, జిల్లా ఆయుష్ సిబ్బంది పాల్గొన్నారు. యోగా గురువులు పాండ్రంగి మురళీకృష్ణ, కరుటూరి నాగలక్ష్మి, సాయి లక్ష్మి, ఆర్ట్ ఆఫ్ లివింగ్ ప్రతినిధులు సురేంద్ర, గోవింద్, వాకర్స్ క్లబ్ ప్రతినిధి కాంక్యాన మురళి తదితరులు సిబ్బందికి పలు రకాల ఆసనాలు, ప్రాణాయామ పద్ధతులను నేర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మానసిక ఒత్తిడిని జయించడానికి, నిత్యం ఉత్సాహంగా విధులు నిర్వహించడానికి ప్రతి ఒక్కరూ తమ దినచర్యలో యోగాను భాగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రిమ్స్ కళాశాలకు చెందిన పలువురు వైద్యులు, అధ్యాపకులు, పారామెడికల్ సిబ్బంది, కార్యాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.








Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546